# ఫ్యాక్టరీల్లో కార్మికుల
# భద్రతపై పర్యవేక్షణ

**- మంత్రి వివేక్**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:** రాష్ట్రంలోని పరిశ్రమల్లో కార్మికుల భద్రత, రక్షణ కోసం ఆయా పరిశ్రమల్లో ఏర్పాట్లను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నామని రాష్ట్ర కార్మిక శాఖమంత్రి జి.వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆదివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఫార్మా రంగ పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు నూతన విధి విధానాలను అనుసరించేందుకు చర్యలు మిగతా.. 2లో




www.aakshitha.com

People's voice


అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

తెలంగాణ దిక్సూచి

సోమవారం మే 18, 2026


# పదిహేనేళ్ళుగా..
# పటాన్‌చెరులోనే!

**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి:** అతనో అవినీతి తిమింగలం. పదిహేనుళ్లుగా పటాన్‌చెరులోనే తిష్టవేసి చక్రం తిప్పుతుంద్రు. అతడు చెప్పిందే వేదం... ఏ ఫైల్ కదలాలన్నా... ఇతను చెప్పాల్సిందే. ఇతనిపై ఉన్నతాధికారిన్నప్పటికి.. ఇతడిదే ఇష్టారాజ్యం. పటాన్‌చెరు నియోజక వర్గంలో 15 ఏళ్లకుపైగా పంచాయతీ కార్యదర్శిగా కొనసాగుతున్న మధుసూదన్ రెడ్డి ఇంకో బాధ్యతతో ప్రస్తుతం ఇస్నాపూర్ పురపాలక సంఘం మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన 15 ఏళ్ల క్రితం పంచాయతీ కార్యదర్శిగా వచ్చారు. నేటికీ మేనేజర్ సీటులో అతుక్కుని పోయారు. పాలనలో సమతుల్యత అవసరమైన సమయంలో ఒకే అధికారి 15 ఏళ్లుగా బాధ్యతలు నిర్వహించడం ఇక్కడే పాతుకుపోవడంపై ఆయన నైజం నియోజకవర్గంలో స్పష్టంగా తెలుస్తుంది. ఒకే చోట విధులు నిర్వహిస్తూ, ఈ విధమైన సుదీర్ఘకాలం ఒకే స్థానంలో ఉండడం వల్ల, మధుసూదన్ రెడ్డి పైరవీలకు పాల్పడుతున్నట్లు, పారదర్శకత లేని విధంగా వ్యవహరిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. పైరవీలు అధికార పార్టీ నేతల సిఫారసులకే పెద్దపీట వేస్తుండడంతో అర్హతలు ఉన్నవారికి అన్యాయం జరుగుతుంది. మేనేజర్ మధుసూదన్ రెడ్డి ఉదంతమే అందుకు ఉదాహరణ. తోటి ఉద్యోగులకు అన్యాయం జరుగుతుంటే పోరాటం చేయాల్సిన తరుణంలో సంఘం నేతలు మౌనంగా ఉండడంపై ఉద్యోగులు మండిపడు తున్నారు. మధుసూదన్ రెడ్డి అనుకున్న చోట పోస్టింగ్ ఇప్పించుకుని దర్జాగా కాలు కదపకుండానే విధులు నిర్వహిస్తున్నారు.

- **అవినీతి తిమింగలం అయినా కదిలించలే**
- **మధుసూదన్ రెడ్డి విధులు ఆది నుండి ఉద్యోగ విరమణ వరకు పటాన్‌చెరులోనే...**
- **మధుసూదన్ రెడ్డిపై ఎవరికి ఫిర్యాదు చేయాలి?**
- **ఒకే అధికారి దశాబ్దానికి పైగా కొనసాగుతున్న వైనం**
- **పంచాయతీ కార్యదర్శిగా వచ్చి.. మేనేజర్‌గా స్థిరపడిపోయి**
- **పైరవీలకే పెద్దపీట**
- **ప్రజా ప్రభుత్వంలో పారదర్శకత లోపించిందా?**
- **అధికార పార్టీ నేతల సిఫారసులకే పెద్దపీట**
- **అర్హులకు అన్యాయం**
- **సిఫార్సు ఉన్నవారికి అనువైన స్థానం**
- **ఇస్నాపూర్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి ఉదంతమే అందుకు ఉదాహరణ**
- **ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు**

### పారదర్శకంగా నిర్వహిస్తేనే...

బదిలీలను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తేనే అర్హులైన ఉద్యోగులను న్యాయం జరగనుంది. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వారు మారుమూల ప్రాంతాలకు వెళ్లేందుకు ససేమిరా అంటూ పైరవీలు చేసుకుంటూ పబ్బం గడుపుతున్నారు.

### 15 ఏళ్లుగా పటాన్‌చెరు నియోజకవర్గంలో కొనసాగడం వెనుక ఆంతర్యం ఏంటి?

సాధారణంగా ప్రతి అధికారి మూడేళ్లకోసారి బదిలీ అయ్యే నిబంధనం ఉంది. కానీ మధుసూదన్ రెడ్డి మాత్రం 15 ఏళ్లుగా పంచాయతీ కార్యదర్శిగా, ఇప్పుడు మేనేజర్ గా కొనసాగడం వెనుక ఏమున్నది. పాలక వర్గాల ప్రోత్సాహం ఉందా.. పదవులు మారనివ్వకుండా కొందరి ప్రయోజనాలు దాగున్నాయా.. ఇప్పటికీ జిల్లా కలెక్టర్‌తో సిడిఎంఏ ఉన్నతాధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు అనే అనుమానం వ్యక్తం అవుతోంది.

### ఓ రాజకీయ నాయకుడి అండదండలతో

15 ఏళ్లుగా ఒకే చోట తిష్టవేసిన మధుసూదన్ రెడ్డి తరచుగా ఓ బలమైన రాజకీయ నాయకుడి అండదండలతో బదిలీ నుంచి తప్పించుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. మేనేజర్ మధుసూదన్ రెడ్డి వల్ల వ్యవస్థలో అవినీతి పెరగడం, నిజాయితీ గల వారికి అవకాశాలు తగ్గడం, మిగతా.. 2లో



# చదువుతోనే భవితకు పునాది

**● కలెక్టర్ చంద్రశేఖర్**

**నల్గొండ, అక్షిత ప్రతినిధి:** భవిష్యత్తుకు బలమైన పునాది విద్య అని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నల్గొండ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. మొదటి స్థానంలో నిలిచిన 13 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు బహుమతిని అందజేశారు. కేజీబివి మరియు మోడల్ స్కూల్‌లకు మిగతా.. 2లో



# విద్యతోనే సమాజ వికాసం

**ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్య**

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జగిత్యాల, అక్షిత బ్యూరో:** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో మంత్రి ఆదివారం పాల్గొన్నారు. మిగతా.. 2లో

# పదిహేనేళ్లుగా.. పటాన్‌చెరులోనే!

మొదటి పేజీ తరువాయి..

సామాన్యులకు సేవలు అందకపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. విజిలెన్స్ విభాగాలు, ప్రభుత్వాలు తరచుగా ఇటువంటి అధికారులను గుర్తించి బదిలీ చేసిన, కొంతకాలానికి మళ్లీ పైరవీల ద్వారా ఇస్నాపూర్ పురపాలక సంఘం లాంటి స్థానాలనే పొందుతుంటారు.

### మధుసూదన్ రెడ్డి పనితీరు నిరంతరం వివాదాస్పదంగా

ఇస్నాపూర్ పురపాలక సంఘం మేనేజర్ మధుసూదన్ రెడ్డి పనితీరు నిరంతరం వివాదాస్పదంగా మారుతుంది. పురపాలక సంఘంలో ఆయన చెప్పిందే వేదమట... గతంలో ఇస్నాపూర్ లో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన మధుసూదన్ రెడ్డి అదే పంథాలో కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆయనను చూస్తే పురపాలక సంఘం ఉన్నతాధికారులు కూడా భయపడతారనే ప్రచారం జరుగుతోంది. కమిషనర్‌ను లెక్కచేయని తీరు చూస్తే ఈ ఆరోపణలకు బలం చేకూరుతుంది. తన కార్యాలయంలో జరిగిన తప్పిదాలు బాహ్య ప్రపంచానికి బహిర్గతమైతే కిందిస్థాయి సిబ్బందిపై విరుచుకుపడటం ఆయనకు వెన్నతో పెట్టిన విద్యలా మారింది.

ఓ రాజకీయ చక్రవర్తి అండతో మధుసూదన్ రెడ్డి లీలలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. దశాబ్దాల కాలంగా కార్యాలయాన్ని ఆక్రమించుకొని ఇష్టారాజ్యంగా మధుసూదన్ రెడ్డి వ్యవహరిస్తున్న పట్టించుకునే వారే కరువయ్యారు.

### గతంలో అనిశాకు చిక్కిన మధుసూదన్ రెడ్డి

గతంలో ఓ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో అధికారికంగా సహాయ పడేందుకు లంచం తీసుకుంటూ మధుసూదన్ రెడ్డి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. మధుసూదన్ రెడ్డి లంచాలకు మరిగారని, చెయ్యి తడప నీదే ఏ పని చేయడం లేదంటూ, లంచం ఇవ్వకపోతే పనులు పెండింగ్ లో పెట్టారని, కాళ్ళరిగేలా కార్యాలయం చుట్టూ తిప్పుకున్నారని బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చి మధుసూదన్ రెడ్డి అవినీతిఅక్రమాలు బాహటం చేశాడు. ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట మధుసూదన్ రెడ్డిని హాజరు పరిచినట్టు ఏసీబీ అధికారులు తెలిపినట్టు తెలిసింది. ఏసీబీ వలలో చిక్కిన పంచాయతీ కార్యదర్శికి తమ విధులు పూర్తయ్యే వరకు ఇంక్రిమెంట్ అయ్యే అవకాశం లేదు. కానీ మధుసూదన్ రెడ్డి పైరవీలు చేసి మరి ఇంక్రిమెంట్ చేయించుకున్నారు. పదోన్నతులు పొందే అవకాశం కూడా లేదు. రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేస్తూ మేనేజర్‌గా కొనసాగుతున్నారు. అవినీతి అక్రమాలకు పెట్టిన పేరు మధుసూదన్ రెడ్డిగా కొనసాగుతున్న.. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా మధుసూదన్ రెడ్డి చేసిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మధుసూదన్ రెడ్డి అవినీతి బాగోతంపై మరో కథనంతో మీ ముందుకు అక్షిత జాతీయ తెలుగు దినపత్రిక వస్తోంది.

# ఫ్యాక్టరీల్లో కార్మికుల భద్రతపై పర్యవేక్షణ

మొదటి పేజీ తరువాయి..

తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు సకాలంలో నిర్మించి పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన అన్నారు. లబ్ధిదారులకు పేమెంట్లు సకాలంలో అందజేస్తున్నామన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2నుండి నూతన పెన్షన్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు.

ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల పెన్షన్లకు ఆమోద ముద్ర వేసిందని ఆయన తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో ఒకటంటే ఒక్క కొత్త పెన్షన్, ఇళ్లు ఇవ్వలేదని విమర్శించారు. మిర్యాలగూడ నకిరేకల్ లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. దీంతో జర్మనీలో 5లక్షల మందికి ఉపాధికి అవకాశం ఉందన్నారు. అదేవిధంగా టామ్ కాం సంస్థ ద్వారా జర్మనీ భాషలో నైపుణ్యానికి ఫ్యాకల్టీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ లు పాల్గొన్నారు.





# ఘనంగా భద్రాచలం గోదావరి నది హారతి

భద్రాచలం అక్షిత న్యూస్:

అధిక జేష్ఠ మాసం శుక్లపక్షం పాడ్యమిని పురస్కరించుకొని భక్తుల కోలహాలం జై జై దానాలతో భద్రాచలం గోదావరి మాత నదిహారతి పురోహితుల మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని పురోహితులు రామవజ్జల రవికుమార్ అన్నారు.

ఆదివారం నాడు శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం భద్రాచలంలో గోదావరి కరకట్ట ప్రదేశాలలో జరిగిన నదీహారతి కార్యక్రమములో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువై ఉన్న ప్రదేశంలోని గోదావరి తీరంలో అధిక జేష్ఠ మాసం ఆదివారంతో ప్రారంభమైనందున లోకకల్యాణ అర్థం



అధిక మాసంలో చేసే సత్కార్యాల వల్ల గోదావరి మాత, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి శుభాశీస్సులతో ప్రజలకు ఆయురారోగ్య ఐశ్వర్య అభివృద్ధి జరుగుతుందని, ఈ అధిక మాసంలో చేస్తున్న గోదావరి హారతి వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన భక్తులకు తెలిపిన అనంతరం భక్తి గీతాలతో భక్తుల జై శ్రీరామాయ నమః అని శ్రీరామ స్మరణతో గోదావరి నదికి గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు నదిహారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు అవుతున్నారని అన్నారు.

అనంతరం పురోహితులు గోదావరి హారతి విశేషాలను ముందుగా వినిపించి, గణపతి పూజ, జైశ్రీరామ్ అలంకారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం భక్తులనే స్రుశింప చేసి పూజా ద్రవ్యాలతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులు

శ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయ నమః అంటూ108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన అనంతరం ముందుగా సీతారామచంద్రస్వామి వారికి12 సార్లు హారతి ఇచ్చిన ఆనంతరం గోదావరి నదికి 21 సార్లు హారతిఇవ్వడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామాను గ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు. అనంతరం శాంతి మంత్ర పఠనం జరిపి, రవికుమార్ శర్మ, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం, నైవేద్యం, శనగలు భక్తులకు పంపిణీ చేయడం జరిగిందని, నదిహారతి కార్యక్రమానికి పూజా సామాగ్రి శ్రీ రాఘవేంద్ర బట్టల షాప్ భద్రాచలం వారు అందించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితులు సత్య ప్రసాద్ శర్మ, కృష్ణమాచార్య, కదంబరి కృష్ణ శర్మ, రామాచార్యులు, కంజర్ల సుబ్రహ్మణ్యం, తేజ శర్మ, వీరభద్ర శర్మ, స్వచ్ఛంద సంస్థలు, భద్రాద్రి కా మహారాజు ప్రతినిధులు మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# చదువుతోనే భవితకు పునాది

మొదటిపేజీ తరువాయి..

చెందిన 5 మంది విద్యార్థులు, స్పోర్ట్స్ స్కూల్ నుండి 4 మంది, జూనియర్ కళాశాలల నుంచి 3 విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఇష్టంతో, కష్టపడి చదవాలని చెప్పారు. పదవ తరగతితో చదువును ఆపకుండా ప్రతి విద్యార్థి ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించాలని, పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదివితేనే నేటి పోటీ ప్రపంచంలో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. గ్రాడ్యుయేషన్ విద్యతో జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. పై చదువులకు వెళ్లే విద్యార్థులకు సరైన దిశానిర్దేశం అవసరమని, ఉపాధ్యాయులు, ఎంఈఓలు విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియట్ లేదా పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు.

అనంతరం మానసిక దివ్యాంగులకు అవసరమైన కిట్‌లను జిల్లా కలెక్టర్ అందజేసి వారి పట్ల సామాజిక బాధ్యతను తెలియజేశారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి దస్రునాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి,ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

# విద్యతోనే సమాజ వికాసం

మొదటి పేజీ తరువాయి..

విద్యా వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలని లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకు వస్తున్నారని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మరియు ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు



తీసుకోవడంతో పాటు విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండడానికి నాణ్యమైన భోజనం అందించాలని నిర్ణయించినట్లు మంత్రి వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం పూట అల్పాహార పథకం ప్రవేశ పెడుతున్నట్లు మంత్రి తెలిపారు. విద్యతోనే సమాజ మార్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న విద్యార్థులు చదువులో రాణించి మంచి ఫలితాలు సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు.

జగిత్యాల జిల్లాలో పదవ తరగతిలో 98.88% ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో నిలిచినందుకు జిల్లా విద్యాశాఖ అధికారులను జగిత్యాల జిల్లా ఉపాధ్యాయులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రూ.8 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి తెలిపారు.

జగిత్యాల జిల్లాలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను అభినందించి నగదు పురస్కారాలను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో పాటు జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## జగిత్యాల ఎన్ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**జగిత్యాల అక్షితబ్యూరో:**
ఎన్ఎస్వీ డిగ్రీ కళాశాలలో 2026 లో డిగ్రీ పూర్తి చేసుకున్న బీయస్సీ విద్యార్థులచే ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉస్మానియా, కాకతీయ, శాతవాహన యూనివర్సిటీ క్యాంపస్ లలో సీటు సంపాదించాలని అక్కడికి వెళ్లినప్పుడు చుట్టూ ఉండే వాతావరణం మిమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు లేదా ఇంకా ఉన్నత విద్యను అభ్యసించడానికి ప్రోత్సాహకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు అలాంటి వాతావరణంలో చదవడం ద్వారా మానసిక దృఢత్వాన్ని, మంచి స్నేహితులను సాధించగలుగుతారని అనుకున్నది ఏదైనా సాధించే పట్టుదలను, జ్ఞానాన్ని అక్కడి లైబ్రరీలలో వుండే పుస్తకాల ద్వారా పొందవచ్చని ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియో గించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ శ్రీపాద నరేష్, శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ముసిపట్ల రాజేందర్, ప్రిన్సిపాల్ మల్లికార్జున్, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## భట్రాజ్ సంఘం జిల్లా అధ్యక్షునిగా అడ్లూరి కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా అడ్లూరి జగన్నాథరాజు ఎన్నిక

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సంధ్యా కాంప్లెక్స్ లో ఆదివారం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా భట్రాజు సంఘం తో పాటు యువజన, మహిళా విభాగం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర భట్రాజు సంఘం నాయకులు, జిల్లా ఎన్నికల అధికారి చెన్నమాధవుని శ్రీ రామరాజు, ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా నన్నపురాజు మనోజ్ రాజు లు హాజరై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భట్రాజు సంఘం





జిల్లా అధ్యక్షుడిగా అడ్లూరి కృష్ణంరాజు,

జిల్లా ప్రధాన కార్యదర్శిగా అడ్లూరి జగన్నాథరాజు,

కోశాధికారిగా సరికొండ శ్రీనివాస్ రాజు,

గౌరవ అధ్యక్షులుగా తుమికి. శ్రీహరి రాజు,

ముఖ్య సలహాదారుడుగా బొల్లెపల్లి ప్రసాద్ రాజు,

ఉపాధ్యక్షులుగా నీలకంఠం.సుధాకర్ రాజు,

సంయుక్త కార్యదర్శిగా అడ్లూరి .నరేందర్ రాజు,

ఆర్గనైజింగ్ సెక్రటరీగా సరస్వతి .సత్యనారాయ రాజు, కార్యవర్గ సభ్యులుగా సరస్వతి శ్రీనివాస్ రాజు,తుమికి వంశీ రాజు

జిల్లా యూత్ అధ్యక్షులుగా తంగెళ్ల. సాయి ప్రసాద్ రాజు, ప్రధాన కార్యదర్శిగా సరికొండ. రేవంత్ రాజు, ఉపాధ్యక్షులుగా ఎర్రం. సాయి రాజు, సంయుక్త కార్యదర్శిగా ఎర్రం.రామరాజు.

జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కాసు. వీణా దేవి, ప్రధాన కార్యదర్శిరాలుగా తంగేళ్ల .సరోజ, ఉపాధ్యక్షురాలుగా ఎర్రం.లక్ష్మి,

సంయుక్త కార్యదర్శిగా నీలకంఠం. స్వర్ణలత, కోశాధికారిగా

సరస్వతి. నాగాంజలి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సరికొండ శైలజ ,

కార్యవర్గ సభ్యులుగా అడ్లూరి. పూజ, నీలకంఠం. అభినయశ్రీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.



# సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర అనిర్వచనీయం

### అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజి వాకడే

**కరీంనగర్, అక్షిత బ్యూరో:**
సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర అనిర్వచనీయమని అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజి వాకడే అన్నారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా ఘనంగా నిర్వహించబడుతున్న ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ విద్యా విజయోత్సవం కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను అందజేసి అభినందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజి వాకడే మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత గురువు స్థానం అత్యంత గొప్పదని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, ఉన్నత లక్ష్యాలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల సేవలు మరువలేనివన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో ఆదర్శప్రాయు లుగా ఎదగాలని ఆకాంక్షించారు. డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమా ణాలు గణనీయంగా మెరుగుపడ్డాయని, ఒకప్పుడు ప్రైవేట్ విద్యా సంస్థల వైపు మొగ్గు చూపిన తల్లిదండ్రులు, ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల వైపు ఆసక్తి కనబరుస్తున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు విద్య, క్రీడలు, సాంకేతిక రంగాలతో పాటు వివిధ పోటీ పరీక్షల్లోనూ ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్నారని చెప్పారు.

ఈ కార్యక్రమానికి నంది శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఆర్డీఓ మహేశ్వర్, విద్యాశాఖ ఏడి మాధవి, సెక్టోరల్ అధికారులు మిల్కురి శ్రీనివాస్, అశోక్ రెడ్డి, దాసి శ్రీనివాస్, ఉమారాణి, మహేందర్, రవీందర్, డిసిఇబి కార్యదర్శి భగవంతయ్య, ఎంఈఓలు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# సోషల్ మీడియా, డిజిటల్ మార్కెటింగ్, స్టార్టప్ రంగాలు అభివృద్ధికి వేదికలు

### - రాష్ట్ర కాంగ్రెస్ యువనేత విష్ణురెడ్డి

**కాజిపేట్, అక్షిత ప్రతినిధి:** సోషల్ మీడియా ఇన్ఫ్యులెన్సర్స్, ఓపెన్ ఐడియా ప్రతినిధులు, డిజిటల్ మార్కెటింగ్ నిపుణులు, స్టార్టప్ వ్యవస్థాపకులు, ఇన్వెస్టర్లు, బిజినెస్ మేనేజ్మెంట్ రంగాలకు చెందిన పలువురు ఒకే వేదికపై సమావేశమై తమ ఆలోచనలు, అభిప్రాయాలు, వ్యాపార అవకాశాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.




హనుమకొండ పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ యువనేత విష్ణు రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, వరంగల్ నగరం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతూ ప్రపంచ నగరాలతో పోటీపడే స్థాయికి ఎదుగుతోందన్నారు. యువతకు కొత్త ఆలోచనలు, వ్యాపార అవకాశాలు, స్టార్టప్ సంస్కృతిని పరిచయం చేసే ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

వ్యాపారం చేయాలనే ఆసక్తి ఉన్న యువతకు సరైన మార్గదర్శనం, పెట్టుబడిదారులతో అనుసంధానం, కొత్త బిజినెస్ ఐడియాలను అందించడంలో ఈ వేదిక కీలకంగా మారుతుందన్నారు.

అలాగే సోషల్ మీడియా ఇన్ఫ్యులెన్సర్లు కేవలం రొటీన్ అంశాలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, వ్యాపారం, సాంకేతికత, సామాజిక బాధ్యత వంటి అన్ని రంగాలకు సంబంధించిన ఉపయోగకరమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పలువురు యువ పారిశ్రామికవేత్తలు, డిజిటల్ క్రియేటర్లు, స్టార్టప్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాసిరకంగా మహిళా సమైక్య భవనం నిర్మాణాలు

**ఉపాధి హామీ పథకం ద్వారా పది లక్షలు నిధులు మంజూరు**

**నాసిరకం మెటీరియల్‌తో నిర్మిస్తున్న కాంట్రాక్టర్లు**

**పట్టించుకోని పంచాయతీరాజ్ ఏఈ**

**వెంటనే మహిళా సమైక్య భవనం నిర్మిస్తున్న నిధులు నిలిపివేయాలి**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గ లింగాల మండలంలో నాసిరకంగా మహిళా సమైక్య భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మెటీరియల్ నాసిరకంగా వేస్తూ సిమెంటు సీకు. ఇసుక. తగినంత వేయకుండా నాచురకంగా నిర్మిస్తున్నారు. నిర్మించిన గోడలకు కూడా నీటిని కూడా పట్టే నాధుడే కరువయ్యారు. గ్రామంలో ఉన్న కొందరు కాంగ్రెస్ అధికార పార్టీ నాయకుల లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాలలో ఒకే కాంట్రాక్టర్ కు నాలుగైదు గ్రామాలు భవనాలు నిర్మించేందుకు స్థానిక నాయకులతో చేతులు కలుపుకొని నాసిరకంగా నిర్మిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వల్లభాపూర్ రాంపూర్ బాకారం తదితర గ్రామాలలో మహిళా సమైక్య భవనానికి 10 లక్షలు మంజూరు కాగా అట్టి నిధులు స్థానిక నాయకులకు పి ఆర్ఏకి కమిషన్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందు కంత అధికారులు లక్షల రూపాయలు తీసుకొని కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాసిరకంగా నిర్మించడం ఎందుకు గ్రామస్తులు కోరుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులు స్థానిక నాయకులు మరియు పి ఆర్ ఏ ఈ కమిషన్లకు మాత్రమే ఈ యొక్క భవనాలు నిర్మిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నాసిరకంగా నిర్మిస్తున్న రాంపూర్ వల్లభాపూర్ బాకారం గ్రామాల మహిళా సమైక్య భవనాల నిర్మాణం చేపడుతున్న వాటికి అధికార పార్టీ నాయకులు పర్యవేక్షించి విధులు మంజూరు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఏ విధంగా కొంతమంది కాంట్రాక్టర్లు ప్రతిపక్ష నాయకులకు ఇచ్చి నాసిరకంగా నిర్మించే వారికి ఎందుకు విధులు మంజూరు చేయాలని. విచారణ చేసిన తర్వాత విధులు మంజూరు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా మండలంలో కొన్ని గ్రామాలలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు అయినటువంటి మహిళా సమైక్య భవనాల నిర్మాణం

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పర్యవేక్షించి గ్రామ ప్రజలను అడిగి కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వాలని నాసిరకం చేసిన దగ్గర పంచాయతీరాజ్ ఏ ఈ నిర్లక్ష్యం వల్ల నాసిరకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా భవనాల పర్యవేక్షణ చేసి నాసిరకం నిర్మిస్తున్న కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వకుండా నిలిపివేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇట్టి విషయంపై ఎంపీ ఓ రాముడును వివరణ కోరగా మా పరిధిలో కాదు ఉపాధి హామీ పథకం ద్వారా ఏపీఓ పరిధిలో ఈ భవనాలు నిర్మిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా పంచాయతీరాజ్ ఏఈ సమక్షంలో నిధులు విడుదలవుతాయని తెలిపారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులు ను వివరణ కోరెందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు

# ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు

**-టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ చేతుల మీదుగా పురస్కారాలు**

**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:**

ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్య విజయోత్సవం వేడుకలను ఆదివారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యా, క్రీడా రంగాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో విశిష్ట ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు చెక్కు, ప్రశంసా పత్రం, జ్ఞాపికలను అతిథులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించడం గర్వకారణమని అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి సంగారెడ్డి జిల్లాకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, కుమ్మరి మౌనిక – జడ్‌పిహెచ్‌ఎస్ మల్కాపూర్, కొండాపూర్ – పదో తరగతిలో ద్వితీయ ర్యాంక్ (592/600), నంపల్లి ధనలక్ష్మి – జడ్‌పిహెచ్‌ఎస్ మల్కాపూర్,



కొండాపూర్ – పదో తరగతిలో తృతీయ ర్యాంక్ (588/600), పెద్దపట్నం ధరణి – జడ్‌పిహెచ్‌ఎస్ యెద్దుమైలారం, కంది – పదో తరగతిలో తృతీయ ర్యాంక్ (588/600), ఎ.గాయత్రి – గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ – ఇంటర్మీడియట్‌లో ప్రథమ ర్యాంక్ (992/1000), ఎం.అరవింద – గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ – ఇంటర్మీడియట్‌లో ప్రథమ ర్యాంక్ (992/1000), బి.నిఖిత – గురుకుల బాలికల కళాశాల, జహీరాబాద్ – ఇంటర్మీడియట్‌లో ద్వితీయ ర్యాంక్ (991/1000), కె.రుత్విక రెడ్డి –




జడ్‌పిహెచ్‌ఎస్ బీరంగూడ, అమీన్‌పూర్ – జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఎం.స్మితక – జడ్‌పిహెచ్‌ఎస్ కానుకుంట, ఆర్‌సీ పురం – వుషు క్రీడలో ముఖ్యమంత్రి కప్–2025 విజేత, వి.ప్రియాంక – కస్తూర్బా బాలికల విద్యాలయం, పుల్కల్ – జాతీయ స్థాయి ఆత్యా పాత్యా క్రీడాకారిణి, కమ్మరి పూజ – కస్తూర్బా బాలికల విద్యాలయం, కొండాపూర్ – ఇంటర్మీడియట్(ఎం పి హెచ్ డబ్ల్యు లో ఫస్ట్ ర్యాంక్ (965/1000), లక్ష్మి పద్మావతి – తెలంగాణ మోడల్ పాఠశాల, వెలిమల – ఇంటర్మీడియట్ ఎం ఈ సి విభాగంలో ప్రథమ స్థానం (912/1000), అలాగే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి వారిని ఉత్తీర్ణులుగా తీర్చిదిద్దిన ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బందిని ప్రత్యేకంగా అతిథుల చేతుల మీదుగా సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు, అదనపు సంచాలకులు శంకర్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు, మండల విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యా సమన్వయ మండలి కార్యదర్శి లింబాజీ, బాలయ్య, తాజుద్దీన్, భీమగౌండ, వెంకటస్వామి, సిద్ధారెడ్డి, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సోమిడీ అభివృద్ధి కమిటీ సభ్యుల చేత పిల్లలకు భగవద్గీత పుస్తకాలు, కర్రసాము దండలు పంపిణీ

**కాజిపేట్, అక్షిత ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 62 వ డివిజన్ సోమిడీ గ్రామంలోని చిన్నారులను శారీరకంగా మానసికంగా దృఢంగా మార్చడం కోసం, మన సంస్కృతి ధర్మము గురించి తెలపడం, వారి లోపల నైతిక విలువలను పెంపొందించి దేశానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దడం కోసం ఆదివారం గ్రామంలో శ్రీ కృష్ణ ధర్మ పరిరక్షణ సేవ సమితి ఆధ్వర్యంలో చిన్నారులకు సోమిడీ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుల చేత భగవద్గీత పుస్తకాలు, కర్రసాము దండలు పంపిణీ చేయడం జరిగింది. చిన్నారులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు గ్రామ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు చిన్నారులకు వారి ఆశీస్సులు అందజేయడం జరిగింది.



ఈ కార్యక్రమంలో సోమిడి గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, ముఖ్య సలహాదారులు,అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్య దేవాలయంలో పాడ్యమి పర్వదిన సందర్భంగా ప్రత్యేకపల్లకి సేవ

**స్వామి వారికి పంచామృత అభిషేకం, ముడుపు సమర్పణ ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ**

**జగిత్యాల అక్షితబ్యూరో:**

జగిత్యాల పట్టణంలోని చింతకుంట సమీపంలో కొలువై ఉన్న శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం లో ఆదివారం భానువాసరే వైశాఖ మాసం శుక్ల పక్షం పాడ్యమిపర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి అలయంలో ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆదివారం సూర్య భగవానుని ప్రత్యేక దినం

ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియు ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది.

పర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానునికి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ చేసారు.తదనంతరం విచ్చేసినటువంటి భక్తులకు ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ చేశారు తదుపరి సూర్యభగవాన్‌కు భక్తులు ముడు పులు కట్టారు.

ఈ కార్యక్రమములో ఫౌండర్ ఛైర్మెన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, సహాయ కోశాధికారి వడ్లగట్ట గోపి ఇతర కార్యవర్గ సభ్యులు, అర్చకులు శ్రీహరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృత్తికా నక్షత్ర వేడుకలు

**సంగారెడ్డి అక్షిత బ్యూరో:**

సంగారెడ్డి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కృత్తికా నక్షత్ర వేడుకలు దేవాల కమిటీ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను జరిపించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించి లలిత సహస్ర పారాయణం చదివారు. వాసవి కన్యకా పరమేశ్వరి




అమ్మవారి పల్లకి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికమాసం మొదటి రోజు సందర్భంగా అమ్మవారికి వాయనాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు మ్యాడం రాధా కిషన్, ఆమెటి మహేందర్ కోశాధికారి జూలకంటి మల్లేశం, కార్యనిర్వాహక కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కుటుంబానికి ఎంపీ పరామర్శ

**అక్షిత బ్యూరో/ అదిలాబాద్:**

అదిలాబాద్ జిల్లా బోథ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఇంచార్జి సబ్ రిజిస్ట్రార్ గా విధులు నిర్వర్తిస్తున్న మెస్రం సాయివివేక్ కుటుంబాన్ని ఆదివారం అదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ పరామర్శించారు. ఇటీవలే సబ్ రిజిస్ట్రార్ నానమ్మ మెస్రం శాంతాబాయి అనారోగ్యం



కారణంగా స్వర్గస్తులైనరాని విషయం తెలుసుకున్న ఎంపీ నగేష్ పరామర్శించి వారి కుటుంబీకులను ఓదార్చారు.
ఎంపీ వెంట మాజీ రైల్వే బోర్డు సభ్యులు జీవి రమణ, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.



# వజ్రోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న మామిడి ప్రదర్శన

**ఉద్యాన పంటల విస్తరణకు రైతులు ముందుకు రావాలి**

**హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష**

**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:**

ఉద్యాన శాఖ అందిస్తున్న ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని పండ్ల తోటల విస్తీర్ణాన్ని పెంచుతూ అధిక ఆదాయం పొందాలని హార్టికల్చర్ శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష సూచించారు. ఆదివారం సంగారెడ్డి ఫల పరిశోధన కేంద్రంలో నిర్వహించిన వజ్రోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె, కార్యక్రమాన్ని ప్రారంభించి ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శనను పరిశీలించారు. వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన మామిడి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫల పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో వివిధ రకాల మామిడి పండ్లను ప్రదర్శించగా, మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల నుండి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష మాట్లాడుతూ, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పండ్ల తోటల విస్తీర్ణం పెంపు కోసం రైతులకు అనేక ప్రోత్సాహక పథకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉద్యాన పంటల సాగు విస్తరణ ద్వారా అధిక ఆదాయం పొందాలని సూచించారు. జిల్లా ఉద్యాన అధికారి పి.సోమేశ్వరరావు మాట్లాడుతూ, సంగారెడ్డి జిల్లాలో సుమారు 16 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోందని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను అనుసరిస్తూ నాణ్యమైన మామిడి పండ్ల ఉత్పత్తి చేపడితే విదేశాలకు ఎగుమతులు చేసి అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఉత్తమ దిగుబడుల సాధనకు నాణ్యమైన మొక్కలు



ఎంతో అవసరమని పేర్కొంటూ, ఫల పరిశోధన కేంద్రం ప్రతి సంవత్సరం సుమారు రెండు లక్షల నాణ్యమైన మొక్కలను సంగారెడ్డి జిల్లా రైతులకు అందజేస్తోందన్నారు.

తెలంగాణ రాష్ట్రానికి ఫల పరిశోధన కేంద్రం ఒక విలువైన ఆస్తిగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ పి.సురేష్, డాక్టర్ కె.వెంకటలక్ష్మి, డాక్టర్ బాబు, డాక్టర్ ఏ.కిరణ్ కుమార్, శాస్త్రవేత్తలు మౌనిక, నవీన్, నితీష్ కుమార్, ఉద్యాన అధికారులు, ఉద్యాన విస్తరణఅధికారులు, డ్రిప్, గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# డీసీఎంను తాళ్లతో లాగి సిపిఐ తీవ్ర నిరసన

**వనపర్తి అక్షిత ప్రతినిధి:**

వనపర్తి జిల్లా పానగల్ మండలం మూడు గ్రామాల్లో కేంద్ర బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ వాణిజ్యగ్యాస్ సిలిండర్ ధర పెంపుపై సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన తెలిపారు. కేతేపల్లి లో డీసీఎం వాహనాన్ని తాళ్లతో కట్టి గ్రామపంచాయతీ వద్ద నుంచి కొంత దూరం లాగి డీజిల్ కొనలేక వాహనాలను ఇక తాళ్లతో లాగాల్సిందేనని సంకేతాలు ఇచ్చి నిరసన తెలిపారు. వెంగలాయపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద ఎర్రజెండాలు ధరించి ధరల పెంపుపై నిరసన తెలిపారు. తెల్ల రాళ్లపల్లి బస్టాండ్ వద్ద పెంచిన పెట్రోల్ డీజిల్ వాణిజ్య వంట గ్యాస్ ధరలను తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ.. వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను ఏకంగా రూ. 993 కు పెంచిందని దానితో హోటళ్లలో తినుబండారాలపై విపరీతంగా ధరలు పెరిగాయి అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ఉండటంతో డీజిల్ పెట్రోల్ ధరలు పెంచమని ప్రజలను మభ్యపెడుతూ వచ్చిన నరేంద్ర



మోడీ ఎన్నికలు ముగియగానే లీటర్ పెట్రోల్ డీజిల్ పై ఏకంగా రూ.3.50 పెంచి ప్రజలను దగా చేశారన్నారు. పెట్రోల్ పై మరో వారం రోజుల్లో రూ. పది పెంచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రష్యా చమురును తక్కువ ధరకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు భయపడి కొనడం లేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, స్విజర్లాండ్ నుంచి నల్లధనం తెచ్చి ప్రతి రైతు ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తామని మోసం చేశారన్నారు. నరేంద్ర మోడీ ఏనాడూ కార్మికుల కర్షకుల సమస్యలను పట్టించుకోలేదని సంపన్నులకు ఊడిగం చేస్తున్నారన్నారు. కార్మిక చట్టాలను లేబర్ కోడులు తెచ్చి నిర్వీర్యం చేశారని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వటం లేదని, పని గంటలు 8 నుంచి 12 కు పెంచారని మోదీ ప్రజా వ్యతిరేక పాలనకు ఇది నిదర్శనం అన్నారు. ప్రజా సమస్యలపై సిపిఐ పోరాడుతుందని బిజెపి ప్రజా సమస్యలను గాలికి వదిలి జైశ్రీరామ్ పేరుతో అధికారంలో కొనసాగుతోందని విమర్శించారు. బంగారం కొనదని, పెట్రోల్ డీజిల్ వాడకం తగ్గించాలని, పొదుపు పాటించాలంటున్నారని, సంసార జీవితం గడిపే వారికి వాటి అవసరం తెలుస్తుందనినరేంద్ర మోడీకి ఎలా తెలుస్తాయని ఎద్దేవా చేశారు. డీజిల్ పెట్రోల్ ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడుతుందని వెంటనే తగ్గించాలని లేదంటే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి వంక గోపాల్, చందు,సంగనమోని రాముదు తదితరులు ధరల పెంపుకు నిరసన తెలుపుతూ డప్పులు కొట్టుకుంటూ పాడిన పాటలు ప్రజలను ఆకట్టుకున్నాయి. సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సిపిఐ పానగల్ మండల కార్యదర్శి దంగు కుర్మయ్య, వార్డు సభ్యురాలు కురుమమ్మ, మాజీ వార్డు సభ్యుడు కమ్మావుల పెంటయ్య, రామదాసు, చిన్న ముత్యాలు, మంగలి వెంకటయ్య, బుడ్డ బాలస్వామి, హోటల్ రాముడు, సంగనమోని రాముడు, దొడ్డ బీరయ్య, సిపిఐ వెంగలాయిపల్లి గ్రామ కార్యదర్శి మల్లెపు బాలస్వామి, తెల్ల రాళ్లపల్లి మాజీ ఉపసర్పంచ్ కాకం బాలస్వామి, గ్రామ శాఖ కార్యదర్శి సహదేవుడు సీనియర్ నాయకులు ఎర్రగుంట రాముడు, కాకంరాముడు, పరంధాములు, తదితరులు పాల్గొన్నారు.




# యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలి

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, అక్షిత బ్యూరో:**
యువత మత్తు పదార్థాలకు జోలికి పోవద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు.

జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శనివారం హసన్



పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మత్తు పదార్థాలు,సైబర్ క్రైమ్, చైన్ స్నాచింగ్, రోడ్డు ప్రమాదాలు, ర్యాగింగ్, బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులు, సిసి కెమెరాల ఏర్పాటు లాంటి అంశాలపై జాగృతి కళాబృందం సభ్యులు సంస్కృతిక కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజలకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రజలను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ డ్రగ్స్ కారణంగా యువత భవిష్యత్తు అంధకారం మారుతుందని, ఎవరైనా డ్రగ్స్ విక్రయించిన, వినియోగించిన పోలీసులకు సమాచారం అందించాలని, గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని షేర్ చేసుకోవద్దని,సైబర్ నేరగాళ్ళతో అప్రమత్తం వుండాలని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ గమ్యాస్థానాలకు క్షేమంగా చేరుకోవాలని, రాష్ట్రంలో మహిళల భద్రత కోసం షీ టీం ఏర్పాటు చేయబడిందని, నేరాల నియంత్రణ కోసం ప్రజల భాగస్వామ్యంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీస్ కమిషనర్ ప్రజలకు సూచించారు. అనంతరం పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో రాణించిన విద్యార్థులను పోలీస్ కమిషనర్ ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత ఏసీపీ లు జితేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, హసన్ పర్తి ఇన్స్ స్పెక్టర్ మహేందర్, ఎస్. ఐలు దేవేందర్, రవితో పాటు డాక్టర్లు ప్రహసీత్, ప్రశాంత్, సామాజిక వేత్త ఆచార్య హసన్ పర్తి మండల సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఐ.కె.పి కేంద్రాలలో లారీల కొరతను నివారించాలి

### రైతులను మోసం చేస్తున్న మిల్లుల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.

### రైతులకు నాణ్యమైన గన్ని బ్యాగులను సప్లై చేయాలి కామ్రేడ్ నాగయ్య

**తిరుమలగిరి, అక్షిత ప్రతినిధి:**
ఐకెపి కేంద్రాలలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, రైతాంగం నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం యంత్రాంగంపై ఉన్నదని సి.పి.ఐ( ఎం-ఎల్ )మాస్ లైన్ తుంగతుర్తి డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ పేర్ల నాగయ్య అన్నారు. ఈరోజు తుంగతుర్తి మండలం తూర్పు గూడెం గ్రామంలోని ఐకెపి కేంద్రాన్ని పార్టీ నాయకులతో కలిసి సందర్శించడం జరిగింది.

ఈ సందర్భంగా కామ్రేడ్ పేర్ల నాగయ్య మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఐకెపి కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని, రైతులు ఎలాంటి ఆందోళనలకు గురి కావద్దని ప్రకటనలు చేస్తున్న, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయని ఆయన ఆవేదన చెందారు. మిల్లర్లు సిండికేట్ గా ఏర్పడి కృత్రిమ లారీల కొరత సృష్టిస్తున్నారని ఆయన అన్నారు. ఐకెపి కేంద్రాలలోకి లారీలను సప్లై చేయకపోవడం, మిల్లు దగ్గరికి వచ్చిన లారీల లోడులు ఆలస్యంగా దిగుమతి చేయడం, తాలు



పేరుతో,తేమ పేరుతో బస్తాకు మూడు నుండి నాలుగు కేజీల తరుగును తీయడం తదితర రూపాలలో రైతుల్ని నష్టపరుస్తున్నారని ఆయన అన్నారు. రైతాంగానికి నాణ్యమైన గన్ని బ్యాగులు ఇవ్వకుండా, చిల్లులు పడిన గన్ని బ్యాగులు సప్లై చేయడం మూలాన కారిపోయిన ధాన్యాన్ని అదనంగా దోచుకుంటున్నారని ఆయన అన్నారు. ఒకవైపు వర్షాకాల సీజన్ దగ్గర పడడం, మరొకవైపు అకాల వర్షాల భయంతో కల్లాలలోని రైతుల గుండెల్లో గుబులు పుడుతుందని ఆయన ఆవేదన చెందారు. మిల్లర్లు కావాలని కాలయాపన చేసి, రైతులు తమ అవసరం కొద్దీ మిల్లర్లు అడిగిన రేటుకు ఇచ్చే విధంగా ఒత్తిడి తీసుకొస్తున్నారని ఆయన తెలియజేశారు. జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికార యంత్రాంగం నిత్యం పర్యవేక్షణ చేస్తున్నప్పటికీ, మిల్లర్లు మాత్రం తమ దోపిడీ విధానాలను మానుకోవట్లేదని ఆయన తెలియజేశారు. రైతులను నష్టపరిచే విధంగా చేస్తున్న మిల్లు యాజమాన్యాలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసినారు.రైతు పండించిన పంటను ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఆయన తెలియజేశారు. రైతులను దోచుకోవాలనే కుట్రలు మిల్లర్లు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండగాని వెంకన్న, లింగంపల్లి మల్లయ్య, రైతులు గుండ్ల లింగయ్య, తాడూరి వెంకటయ్య, బత్తుల వెంకన్న, లింగంపల్లి మల్లేష్, బత్తుల మధు, బత్తుల కలమ్మ, ఎనగందుల బాయమ్మ, ఆకుల రజిత, తాడూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# నాంపల్లిలో అరుదైన సంఘటన ఒక్క విద్యార్థికి 8 మంది పరీక్ష సిబ్బంది

### - ఒక్క విద్యార్థి కోసం పూర్తిస్థాయి పరీక్ష నిర్వాహన

**నాంపల్లి, అక్షిత న్యూస్:** నాంపల్లి మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం వింత సంఘటన చోటు చేసుకుంది. ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలలో భాగంగా శనివారం మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం జంతు శాస్త్రం పరీక్షకు ఒకే విద్యార్థిని హాజరు కావాల్సి ఉంది. సాధారణంగా పరీక్ష మధ్యాహ్నం 2: 30 గంటలకు మొదలవ్వాల్సి ఉండగా, 2:10 గంటల వరకు విద్యార్థిని రాకపోవడంతో ఎదురుచూసిన సిబ్బంది ఫోన్ ఆమెను పరీక్షకు రప్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2:15 నిమిషాలకు విద్యార్థిని పరీక్షా కేంద్రానికి చేరుకోవడంతో అందరూ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. ఆ విద్యార్థిని కోసం పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్ శవ్వ శ్రీనివాస్, డిపార్ట్మెంటల్ అధికారి తండు స్వామి, ఇన్విజిలేటర్ ముత్యం వెంకన్న, పోలీసు, ఏఎన్ఎం, రికార్డు అసిస్టెంట్, అటెండర్, వాటర్ బాయ్ తో కలిపి మొత్తం ఎనిమిది మంది సిబ్బంది విధులు నిర్వహించడం గమనార్హం

# భగవంతుడి ఆశీస్సులు రవికుమార్ యాదవ్‌పై ఉండాలని ప్రత్యేక పూజలు..

### - బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధికి జన్మదిన శుభాకాంక్షలు

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:**
బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి శేరిలింగంపల్లి కాంటెస్టేడ్ ఎమ్మెల్యే, ఇంచార్జ్ రవికుమార్ యాదవ్ పై భగవంతుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఉమ్మడి మియాపూర్ డివిజన్ కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ ఆకాంక్షిస్తూ రవికుమార్ యాదవ్




జన్మదిన వేడుకలు మసీద్ బండ లోని బీజేపీ కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. గణేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మక్త మహబూబ్ పేట్ డివిజన్ నలుగురు వేదపండితులు సన్నాయి మేళాల తో వేడుక గా వెళ్లి ప్రత్యేక ఆశీర్వాద పూజలు నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, ముందు ముందు మరెన్నో ఉన్నత పశువులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాజే రావు శ్రీను, రెడ్డమ్మ,, రాము, డివిజన్ సీనియర్ నాయకులు, మారబోయిన రవి కుమార్ యాదవ్ అభిమానులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కురుమిద్దలో రెస్ట్ బెంచెస్ బహుకరణ

**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:**

కల్వకుర్తి మండలం కుర్మిద్ద గ్రామంలో మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పబ్లిక్ రెస్ట్ బెంచెస్ కార్యక్రమం లో భాగంగా గ్రామ బస్ స్టాప్ ఆవరణలో ప్రజల సౌకర్యార్థం రెండు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయడం జరిగింది.ప్రతిరోజూ బస్ కోసం వేచి ఉండే ప్రయాణికులు, వృద్ధులు,




మహిళలు మరియు గ్రామ ప్రజలు కూర్చొనేందుకు ఏర్పాటు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు కుకుడాల శ్రీకాంత్ నేత మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పించే దిశగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు మిత్ర ఫౌండేషన్‌నీ అభినందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కృష్ణారెడ్డి మాజీ సర్పంచ్ దామోదర్ గౌడ్ గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు మరియు మిత్ర సభ్యులు పాల్గొన్నారు

# భూదాన్ భూములు కబ్జా.. రక్షణ ఏది?

**తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల్ డిమాండ్**

**సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ శంకర్ నాయక్ వై గిరిప్రసాద్**

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో భూదాన భూములు అక్రమనకు కబ్జాకు గురి అవుతున్న మండల్ వాటికి రక్షణ లేకుండా పోయిందని నాగర్ కర్నూల్ జిల్లా సర్వోదయ మండల్ 3 మహాసభలు కల్వకుర్తి పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఈరోజు జరిగినది సభలకు ముఖ్య అతి థులుగా తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు అర్ శంకర్ నాయక్,వై గిరిప్రసాద్ హాజరై విమర్శించారు.ఈ మహా సభలకు అధ్యక్షత జూపల్లి రాములు ఊహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ స్థాపించిన సర్వోదయ మండల్ నందు వినోబాభావే పనిచేస్తూ భూమిలేని నిరుపేదల కొరకు దేశవ్యాప్తంగా 14 సంవత్సరాలు పాదయాత్ర చేసి 46 లక్షల




ఎకరాల భూములను దానపూర్వకంగా స్వీకరించడం జరిగింది ఆభూములను పేదవారికి పంచుటకు1951లో భూదాన్ బోర్డు ఏర్పాటు చేసి ఆ భూములను కొంతవరకు పంపిణీ చేయడం జరిగింది. మిగులు భూములను బడా రాజకీయవేత్తలు పేదలకు పంపిణీ చేయకుండా అడ్డుపడుతూ అక్రమనకు చేస్తున్నారు ఖమ్మంలోని వెలుగుమట్ల లోని పేద ప్రజల కూల్చడం జరిగింది భూములను ప్రభుత్వం కాపాడి బుదాను రోడ్డు ఏర్పాటుకు అనుకూలంగా స్పందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుజాత, జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి,ప్రవీణ, నవీన్,జూపల్లి రాములు, శశికళ, కుమార్, చిన్నస్వామి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సర్వోదయ మండల్ సభ్యులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:**

ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక- 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆదివారం రోజున విద్యా వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యా విజయోత్సవ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ కామ్డే అనిల్ కుమార్, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్ లతో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత స్థాయిలో నిలుస్తారని, ప్రభుత్వ పాఠశాలలలో నిష్ణాతులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు కష్టపడి చదివి ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని, ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు సహకారం అందించాలని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచాలని తెలిపారు.



అనంతరం ప్రభుత్వ-స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల నుండి 10వ తరగతిలో జిల్లా టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలల నుండి జిల్లా స్థాయి టాపర్లుగా నిలిచిన ముగ్గురు విద్యార్థులకు, క్రీడలలో జాతీయ స్థాయిలో పాల్గొన్నటువంటి ముగ్గురు విద్యార్థులకు ఒక్కొక్కరికి 10వేల రూపాయలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగినది. ప్రభుత్వ-స్థానిక సంస్థల ఉన్నత పాఠశాలల నుండి మండల స్థాయి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రము, జ్ఞాపిక అందించడంతో పాటు ఉల్లాస్ లో వాలంటీర్లుగా సేవలందించిన ఇద్దరికీ ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్, , ఏ సి జి ఈ జనార్ధన్, జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కో-ఆర్డినేటర్లు లతీఫ్, శాంతి కుమార్, భాగ్యలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి రాథోడ్ సుభాష్, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జీసస్ బ్లెస్సింగ్ చర్చిలో యేసయ్య ఆత్మీయ ఉజ్జీవ సభలు

**ఘనంగా నిర్వహించిన స్థానిక సంఘ పాస్టర్ జాన్ రామస్వామి**

**ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ బృంగిరత్నమాల ఆనంద్ కుమార్**

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:**

స్థానిక జీసస్ బ్లెస్సింగ్ చర్చి, కల్వకుర్తి మున్సిపాలిటీ లో దేవర కొండ రోడ్ నందు మే ,14 ,15 ,16 తేది లలో యేసయ్య ఆత్మీయ ఉజ్జీవ సభలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సభలలో స్థానిక సంఘ కాపరి జాన్ రామస్వామి మూడు దినములు ఉజ్జీవ సభలను ఉద్దేశించి ప్రసంగించారు దేవుని కి నమ్మకముతో యథార్థమైన మనసుతో నీ పొరుగు వారిని ప్రేమించాలని నీ తల్లి తండ్రులను సన్మానించాలనీ ఈర్ష ద్వేషాలు విడిచిపెట్టాలని ప్రతి ఒక్కరు సోదర భావంతో మెలగాలని ఆత్మీయమైన భక్తిని అనుసరించుకోవాలని దేశం కోసం రాష్ట్రంలో ముఖ్యమంత్రి మంచి పరిపాలన అందించే విధంగా








అధికారుల కోసం ప్రజాప్రతినిధులు రైతుల కోసం ప్రార్థనలు చేశారు ఇట్టి సభలకు అతిథులుగా మున్సిపల్ చైర్మన్ రత్నమాల బృంగి ఆనంద్ కుమార్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు బాల్ రెడ్డి హాజరై క్రైస్తవ సమాజంతో పాటు పాల్గొని ప్రసంగించారు ఈ సమావేశాలు జీసస్ బ్లెస్సింగ్ చర్చ్ సభ్యులు డి ఎఫ్రప్రా బి,శేఖర్,కే విజయ్ కుమార్, హెచ్ నరేష్,రమేష్, యెహోరాం,పి.జాన్ స్టివెన్ సన్ మరియు సంఘస్తులు నిర్వహించారు కల్వకుర్తి మున్సిపాలిటీ మరియు పరిసర సంఘాల నుండి అనేకులు ఈ మీటింగ్లలో పాల్గొని దేవుని మహిమ పరిచారు పాస్టర్ జయరాజు పాస్టర్ కృపా శేఖర్ పాస్టర్ ప్రభాకర్ పాస్టర్ ఆనంద్ కుమార్, పాస్టర్ తిమోతి పాస్టర్ డానియల్ రాజ్ పాస్టర్ జాన్ బుచ్చయ్య పాస్టర్ భాస్కర్ పాస్టర్ శేషు పాస్టర్ జోసఫ్ వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొని కల్వకుర్తి పట్టణ క్షేమం కొరకు అభివృద్ధి కొరకు ప్రార్థనలు చేశారు.



# శిలా ఫలకం ధ్వంసం

## కాంగ్రెస్ నాయకుల నిరసన

**అక్షిత ప్రతినిధి, భూపాలపల్లి:**

కాటారం మండలం గారేపల్లిలో దశాబ్ద కాలంగా రోడ్డు లేక అవస్థలు పడుతున్న ప్రజల కోసం మంత్రి శ్రీధర్ బాబు సీసీ రోడ్డును ఏర్పాటు చేసి ప్రారంభించుకుంటే బిఆర్ఎస్ నాయకులు ఓర్వలేక శిలా ఫలకాన్ని ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీపీ పంథకానీ సమ్మయ్య అన్నారు.

బిఆర్ఎస్ నాయకుల తీరును ఖండిస్తూ ధ్వంసం అయిన శిలా ఫలకం దగ్గర కాంగ్రెస్ నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు.. ఎతీం కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాగా శిలాఫలకాన్ని ధ్వంసం చేస్తున్న వీడియోలు సీసీ టీవీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి.మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పుట్టిన రోజు సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుందని, ఆయన్ని సంతోష పెట్టడానికే బీఆర్ఎస్ నాయకులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు.. శాంతి నెలకొనాలని మంత్రి శ్రీధర్ బాబు కోరుకుంటే మాజీ ఎమ్మెల్యే తన కార్యకర్తలను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.



# సామాజిక సేవలో మేటి ప్రసాద్స్ ఫౌండేషన్

## - ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**మియాపూర్, అక్షిత ప్రతినిధి:**

మియాపూర్ కేంద్రంగా గత కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న సామాజిక కార్యక్రమాలు చేపట్టిన ప్రసాద్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలను కొనియాడిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం నాడు ఎస్ ఆర్ ఎస్టేట్స్ కమిటీ హాల్ లో 16వ ఉచిత మెగా హెల్త్ క్యాంపు కార్యక్రమం ప్రసాద్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు . ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ ,డైరెక్టర్ రమాదేవి ,డైరెక్టర్ అండ్ చీఫ్ కోఆర్డినేటర్ లీలాప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంపులో ఏమ్ ఎల్ ఏ అరెకపూడి గాంధీ ప్రారంభించారు ఈ మేగా హెల్త్ క్యాంపులో అన్ని రకాల ఆరోగ్య పరిక్షలు ఈసీజీ, 2 డి ఎకో, క్యాన్సర్ స్క్రీనింగ్, బిపి అడ్మిట్, రక్త పరీక్షలు,అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. ప్రసాద్స్ ఫౌండేషన్, మెడి కవర్ హాస్పటల్ వారి సౌజన్యంతో ఉచితంగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ సమాజ సేవ చేసేవారు ఇంట్లో కూర్చుని మాట్లాడటం కాదు ప్రజల లోకి వచ్చి సమాజ సేవ చేస్తున్న ప్రసాద్ ఫౌండేషన్ ఒకచక్కటి ఉదాహరణ అని వారి సేవలను కొనియాడారు .ఈ సందర్భంగా ప్రసాద్ ఫౌండేషన్ వారు చేస్తున్నటువంటి సామాజిక కార్యక్రమాలు విద్యార్థులకు బుక్స్, అనాథా శ్రమాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్ పంపిణీ , కరోనా సమయం లో నిత్యావసర వస్తువులు, స్వైన్ ఫ్లూ మందులు, కరోనా వ్యాక్సిన్స్, మరియు స్కూల్లో ఉచిత ఎగ్జామ్ కిట్లు, మహిళా సాధికారత కోసం కుట్టు మిషన్ లు, వెట్ గ్రైండర్స్, తోపుడు బళ్లు, గొడుగులు, తోపుడు బళ్లకు సోలార్ లైట్స్, వంటి అనేక కార్యక్రమాలతో విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. మియాపూర్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హైదర్నగర్ తాజా మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్ ,ప్రసాద్ ఫౌండేషన్ డైరెక్టర్ లీలా ప్రసాద్ , సమ్మెట ప్రసాద్, స్వామి, డాక్టర్ రవి, ఫౌండేషన్ సభ్యులు వినోద్ చౌదరి, ఎంఆర్కె చౌదరి, శ్రీ కాంత్, శ్రీను చౌదరి, బాలు, చిన్నా,పెద్దబాబు, భాష, రవి, తులసి, యశ్వంత్,సుబ్బారావు, శ్రీనివాస్, ప్రసాద్, ఎస్ ఆర్ ఎస్టేట్స్ అసోసియేషన్ సభ్యులు, వెంకటేశ్వర్లు, బాబ్జీ, మూర్తి, శ్రీ రామ చంద్ర మూర్తి, సత్యనారాయణ, సాంబయ్య, నాని తదితర సభ్యులు పాల్గొన్నారు, పెద్ద సంఖ్య లో మహిళలు , మరియు పురుషులు పాల్గొన్నారు. మొత్తం 312 మంది ఆరోగ్య పరీక్షలు చేయించు కున్నారు. ఈ ప్రసాద్స్ ఫౌండేషన్ ఫౌండర్ , చైర్మన్ డి ఎస్ ఆర్ కె ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి, పరీక్షలు నిర్వహించిన హాస్పిటల్ వైద్యులు, సిబ్బందికి, అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.







# ఎన్టీఆర్‌లో విద్యావారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:**

ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి మహబూబ్ నగర్ మేయర్ జి మమత మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలుస్తుందని నేడు దేశానికి రోల్ మోడల్ గా మారిందని అలాగే మన యం.ఎల్. ఏ. యన్నెం. శ్రీనివాస్ రెడ్డి విద్యపైనే కాకుండా ప్రతిరంగంలోని వారందరూ మహబూబ్ నగర్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండే విధంగా ప్రతి ఒక్కరూ ఈ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నారు అందులో భాగంగా విద్యార్థులైన మీరంతా మీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అందుకు కష్టపడి విజయం సాధించాలన్నారు.




అలాగే ఇంచార్జ్ ప్రిన్సిపల్ అమీనా ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికను విద్యా వారోత్సవాల పేరుతో నిర్వహించిన ఏడు రోజుల కార్యక్రమాలు వాటి అభివృద్ధిపై జరిగిన సమీక్షను వివరించారు ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారత, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల కల్పనకై డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టడం ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయంటున్నారు.

అనంతరం రాష్ట్ర మరియు జాతీయస్థాయి క్రీడలలో విజయాలు సాధించిన విద్యార్థిని క్రీడాకారులకు సన్మానం, అలాగే దేశ్ పాండే ఫౌండేషన్ ద్వారా వివిధ రకాల కంపెనీలలో ప్లేస్మెంట్స్ సాధించిన విద్యార్థినులను కూడా సన్మానించు కోవడం జరిగింది.

చివరగా సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం, కూచిపూడి, చేసిన విద్యార్థినులైన మీనాక్షి, స్నేహ నృత్య ప్రదర్శన, మహిళా సాధికారత పై ఎన్. సి సి విద్యార్థినిలు నిర్వహించిన నాటక ప్రదర్శన, తెలుగు విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కన్వీనర్ డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, ఐక్యూఏసి, కోఆర్డినేటర్ డాక్టర్ జె శ్రీదేవి, డాక్టర్ హరిబాబు, డాక్టర్. లక్ష్మీ నరసింహారావు, మద్దిలేటి, డాక్టర్ మార్కండేయ, స్వరూప పాల్గొన్నారు.

# విధులలో నిబంధనలు పాటించని పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

## - జిల్లా కలెక్టర్ కె. హరిత

**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి:**

విధులలో నిబంధనలు పాటించని పంచాయితీ కార్యదర్శి సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని దహేగాం మండలం బిబ్రా గ్రామపంచాయతీలో సర్పంచ్, ఉప సర్పంచ్ లు కార్యదర్శిపై చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చేసిన విచారణలో పంచాయతీ కార్యదర్శి డి.సుమలత గ్రామపంచాయతీ తీర్మానం, సర్పంచ్, ఉపసర్పంచ్ ఆమోదం లేకుండా 1 లక్ష 2 వేల 297 రూపాయల నిధులను నిబంధనలకు విరుద్ధంగా డ్రా చేశారని, ఇతర చెల్లింపులలో నిబంధనలు పాటించలేదని తేలడంతో సదరు పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామపంచాయతిలో నిధులు చెల్లింపు పారదర్శకంగా చేయాలని, నిబంధనలు అతిక్రమించినా, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.